# గాలిప్రయాణం

[కథానిక]

●

= శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న =

అది గొడవంటే గొడవకాదు యింట్లో తల్లీ, పిల్లలూను! రాత్రి ఆవిడతో చెప్పి మరీ పడుకున్నాను: "ఒంటిగంట అయింది యిప్పుడు. రేపు నేను లేచేదాకా లేపవొద్దని." ఎప్పుడూ యింతే వీళ్లు. "ఏమిటాగల్లంతూ ?" అంటూ అతిచిరాకుగా లేచేను.

"మీచెల్లెలూ, బావా వొస్తున్నారట తొమ్మిది గంటల మెయిల్లోను. టెలిగ్రాం వొచ్చింది. యీ పాటికి మొహం కడుక్కుని తయారుకండి, అప్పుడే ఎనిమిది దాటుతోంది."

"చెల్లెమ్మ వొస్తోందీ? ఆఁ? ఆఁ? ఏదీ టెలిగ్రామూ, యిలా తే!" అంటూ హడావిడిగా నుంచున్నాను, సడలిన పంచకుచ్చిళ్లు సర్దుకుంటూను.

"అబ్బ! చెల్లెలుపేరు చెబితే చింకిచేటంత అయింది మొహం" అని ఆమె కొంటెతనంగా మొహం మీదికి ఎత్తిపట్టుకుంది ఆ మట్టిరంగుకాయితంముక్క.

పార్వతిని చూచి ఆరేళ్లయిందేమో, వొస్తున్నదన్న వార్త వినేసరికి ఉద్వేగమే పుట్టుకొచ్చింది నాకు. వాళ్లు వొచ్చేసరికి కాఫీ కాచివుంచమనీ, చంటిపిల్లడికి గూట్లో వున్న గ్లాక్సో కలిపియివ్వాలనీ, స్నానాలకి వేణ్ణీళ్లు సిద్ధంగా వుంపించాలనీ, ఆ వెధవవిరిగిపోయిన ముక్క కాకుండా పెట్లోది యింకో బిళ్ల తీసి ఆ సబ్బుపెట్టెలో పెట్టమనీ, యిలాగ్గా యేవేవో ప్రిలిమినరీయిన్‌స్ట్రక్షన్లు యిచ్చి టాయిలెట్టుఅవడానికి నీళ్లగదిలోకి పోయేను. తల దువ్వుకుని 'టై' కట్టుకుంటూవుంటే వాకట్లో హారన్ మోగింది. నా కంగారు ముందుగానే వూహించుకుని డ్రైవరుకి కబురెట్టినందుకు యిల్లాలిని మనస్సులోనే అభినందించేను. ఓ గ్లాసుడు కాఫీ ఆచమనంచేసి, సిగరెట్టు కాల్చుకుంటూ పోర్టికోలో వున్న వాహనం అలంకరించి సారథ్యానికి పూనుకున్నాను. త్రోవలో పెట్రోలుబంకుదగ్గిర ఓమాటూ, సిల్కుయెంపోరియందగ్గిర యింకోమాటూ కాస్త ఆగవలసివచ్చినా, స్వంతసారథ్యం మూలాన పదినిమిషాలు ముందుగానే గమ్యస్థానం చేరుకున్నాను. టికట్టు కొనుక్కుని తీరా ప్లేటుఫారంమీద అడుగుపెడుదునూ, దెయ్యంలాగ కనిపించింది బోర్డు—'౧౫౩ డౌన్ ౫౫ నిమిషాలు లేటు'. కాస్సేపు అక్కడే అటూ యిటూ పచారీ చేద్దామనుకున్నాను. తిరగడానికి ఖాళీ ఒహటి వుండి చచ్చిందికనకనా! ఎక్కడ చూచినా పోస్టలువాళ్ల సమ్మె, హడావిడీని. ఇంకోనాడయితే అదంతా కుతూహలంగా చూచి శోధించేవాణ్ణే; కాని ఆ వేళ నా మనస్సు హృదయానికి లొంగిపోయింది. రిఫ్రెష్‌మెంటురూములోకి పోయేను కాఫీ పుచ్చుకోడానికి...పార్వతమ్మదీ నాలాగే కాఫీగతప్రాణం. ఈ కాఫీకి బదులు టీ త్రాగమంటే ఆరుజౌన్సుల ఆముదం ఒక్కగుక్కని తాగినట్టు అనిపిస్తుంది. పాపం, ఏమి అవస్థ పడిపోతోందో, దిక్కుమాలిన ఉత్తరాది ప్రయాణం!

౨

పార్వతే మా యింట్లో కడగొట్టుపిల్ల; నా తరవాత అదేను. అంచేత బాగా ప్రాజ్ఞత వచ్చే

దాకా కలిసే ఆడుకుంటూవుండేవాళ్లం—లక్కపిడతలతో బొమ్మరిళ్లల్లో ఆడుకుంటూన్నందుకు నన్నూ, నిక్కర్లు తొడుక్కుని హాకీబేటుతో ఆడుకుంటూన్నందుకు దాన్నీ యిాడువాళ్లు ఎగతాళిచేస్తూన్నానూ. ఏడాదికి ఏడాదీ జ్ఞానం ముదిరినప్పటికీకూడా, రోజూ అథమం ఓగంటసేపయినా చెల్లెమ్మతో కబుర్లుచెబితేనే గాని తృప్తి వుండేదికాదు. చూస్తూవుండగానే నా చదువు సమాప్తమయి ఉపాధిభిక్షాటనానికి బయలుదేరవలసివొచ్చింది. అంతకు పదిరోజులక్రితమే అత్తవారింటికి వెళ్లిన పార్వతి, నేను ఢిల్లీ వెళ్లినతరవాత వ్రాసిన వుత్తరం చూసుకుని, నాసంరక్షణవిషయమయి పడిన ఆందోళన అంతా ఆమె జవాబువ్రాసిన ఆ పదిపేజీల వుత్తరంలోనే సువ్యక్తమయింది. నాటినుంచీకూడా, అప్పుడప్పుడు తపాలాముఖంగానేగాని ముఖాముఖి చెల్లాయిని చూచే అదృష్టం పట్టనివ్వలేదు ఉద్యోగ మాహాత్మ్యం !

ఉదయాన్నే కాఫీకుంపటి అంటించినదగ్గర నుంచీ రాత్రి భోజనాలు అయి ఎంగిళ్లు ఎత్తుకొనే దాకా చెల్లాయి చేసిన పని యేదీ రిమార్కులేకుండా పోయేది కాదు. 'పార్వతి పనులు చెయ్యడం కూడానా'అనో, పాడుపనులు 'పార్వతికి పరిపాటే'ననో, మరోవిధంగానో నొచ్చుకుని 'యింత అమాయకురాలు రేపు అత్తవారింటికి వెళితే ఎలాగ అఘోరిస్తుందో'నని తహతహలాడుతూవుండేది అమ్మ. నాటి పద్నాలుగేళ్ల పిల్ల నేడు యిరవైయేళ్ల యువతి; యిద్దరు బిడ్డల తల్లి; ఒకరింటి పెద్దకోడలు. అత్తగారికి కుడిభుజం అయి నిలిచి, పాడీ పంటా, చిన్నా పెద్దా, అతిథీ అభ్యాగతులతో కూడుకున్న ఆకుటుంబభారాన్ని యావత్తూ అతిచాకచక్యంగా నిర్వహించుకు పోతోంది అని తలుచుకునేటప్పటికి ఆశ్చర్యం, జాలీ కూడా ఒక్కమాటుగా కలిగేయి. ఎంతలో ఎంత మార్పు! ఆకారంలో ఎంత మార్పు వొచ్చిందో? అసలు పోల్చుకోగలుగుతానా ?

## 3

ఇంకా రైలురావడానికి అయిదునిమిషాలు వ్యవధి వుంది. అటూ యిటూ పచారుచేస్తున్నాను. ఇంతలో ఓచీటీ ముక్క పట్టుకుని కచేరీబంట్రోతు హాజరయ్యేడు. సారాంశం నన్ను నుంచున్నపాటున కచేరీలో వాలమని. ఏదో కొంపలు మునిగేటంత వ్యవహారంట. దీన్ని తగలేసిన నౌకరీ. సరేనని గేటుదరికి వెళ్లబోతూవుండగా రైలు డిస్టెంటుసిగ్నలు దాటడమూ, ఆఖరిగంట మోగడమూకూడా జరిగేయి. అకాత్తుగా బ్రేకువేసిన బండీలాగ అక్కడే నుంచున్నాను. వాళ్ల పెట్టే అక్కడే ఆగింది. బావ హుషారుగా నవ్వుతూ వొచ్చి కరస్పర్శ చేసేడు. చెల్లి ఒక్క గంతులో వొచ్చి కౌగిలించేసుకున్నంతపనీ చేసింది. మా కళ్లకొలుకులు చెమ్మగిల్లేయి. ఆమెచేతిలో పిల్లడిని తీసుకుని ముద్దెట్టుకున్నాను. అవధిలేని ఆనందంలో ముహూర్తమాత్రం నిశ్చేష్టితులం అయిపోయేం. సామాన్లు దింపిస్తూనే వాళ్లు వేసిన కుశలప్రశ్నల కన్నిటికీ జవాబులు యిచ్చేను. మాటిమాటికీ రిస్టువాచీ చూచుకుంటూ నెమ్మదిగా ప్లేటుఫారం దాటి కారు ఎక్కేం. క్లైవుస్ట్రీటుమలుపుకి వొచ్చేసరికి పావుతక్కువ పదకొండు అయింది. ఆఫీసుదగ్గర కారు ఆపి నేను దిగడం చూచి చిన్నబుచ్చుకుంది పార్వతి. నాలుగింటికల్లా వొచ్చేస్తానుగదా అని వూరడించి పంపించేను.

## ४

రెండో అంతస్తుమధ్య హాల్లో షేరుహోల్డర్లు అందరితోనూ కలిసి ఏదో మహద్విషయం సంప్రదిస్తున్నాడు మేనేజరు. లిఫ్టు దిగి నా గదిలోకి వెళుతూనే కబురంపించేను నేను వొచ్చినట్టు. ఉత్తరక్షణంలో అసిస్టెంటుమేనేజరు నురగలుకక్కుకుంటూ వొచ్చేడు "గుడ్‌మార్నింగ్ సార్"అంటూను.

"ఏంవిటండీ విశేషాలూ, అంత నుంచున్నపాటున రమ్మని కబురుచేసే రేం?"

"చిత్తం. రంగూన్‌లో కంపెనీలకి లైసెన్సులు తిరిగీ యిస్తున్నారట. మన బ్రాంచిలైసెన్సు వ్యవహారం వొహటేన్నీ, మన కంపెనీవాటాలు అన్నీ దేశీయులపరం చెయ్యడం వొహటీన్నీ అర్జంటుగా జరిగించాలని

మేనేజరుగారు నిశ్చయించేరు. మీకన్న పెద్దలూ, అనుభవజ్ఞులూ యింకొకరు లేరని షేరుహోల్డర్లు, మేనేజరుగారు అందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. అందుకని తమరికి శ్రమ……"

"ఊఁ." అని రెండునిమిషాలు ఆలోచించి "ఢిల్లీ వెళ్లి అధికారులని కలుసుకుంటేగాని ఆ యీ పనులు త్వరగా సాధ్యపడవు. మరి మెయిలులో నాకు బెర్తు రిజర్వేషన్ దొరికిందా?" అన్నాను.

"ఆ మాత్రం వ్యవధిగూడా లేదంటున్నారు మేనేజరుగారు."

"మరి మార్గం?"

"వాయుమార్గం-ట"

"దానికిమాత్రం సావకాశ మేదీ? యివాళ లక్షింవారం. పోతే మళ్లీ మంగళవారంనాడుగాని విమానం లేదు. యింత అద్దద్దీమని కూర్చుంటే యిప్పుడు అందులోమట్టుకు సీటు దొరుకుతుందా? అయినా ప్రయత్నిస్తాను" అని ఫోనుమీద చెయ్యివేసేను.

"తాతాఎయిర్‌సర్వీస్‌వారి ప్లేనులో తమరికి కావలసిన ఏర్పాట్లు చేయించేరు మేనేజరుగారు. యింకోగంటలో బయలుదేరుతుందిట. కావలసిన కాగితాలన్నీ యీసేచెల్‌లో వున్నాయి. ఛోటాహాజ్రీ కూడా యిక్కడే ఏర్పాటుచేయించేరు" అని అతను యింకా చెబుతూవుండగానే మేనేజరు వొచ్చేడు. స్థాలీపాకంనాడు వియ్యపురాలికి వుండేంత కంగారూ వుంది ఆయన మొహంలో. వ్యవహారం అంతా స్థూలంగా నాలుగుమాటల్లో చెప్పి "నేటికి పదిహేనుఏళ్లయి ఉద్ధరిస్తూన్న యీ సంస్థ మీదికాని నాది కాదని వేరే చెప్పనక్కర్లేదు. మేమంతా అంకెలులేని సున్నాలం. పాలముంచినా నీటముంచినా మీరే"నని రెండుచేతులూ పట్టుకున్నాడు, వప్పగింతల సమయంలో (కన్యాదాత) వియ్యంకుడిలాగ మొహంపెట్టి.

౫

సాయంత్రం నాలుగున్నరకి ఢిల్లీ విల్లింగ్డను ఎయిరోడ్రోము చేరుకుంది ప్లేను. ఆ సాయంత్రమే అధికారులని కలుసుకుని మంచీ చెడ్డా మాట్లాడేసేను. మర్నాడు సెక్రటేరియటుకి వెళ్లి శంఖంలో పోసిన తీర్థం అనిగూడా అనిపించేను. ఆ కాయితాలు మా కంపెనీసీళ్లతో నాలుగోనాటికల్లా తిరిగి ఢిల్లీ చేరుకోవడం తరవాయిగా పని సవ్యంగానే పూర్తయింది. ఆ కాస్తాకూడా నిర్విఘ్నంగా కొనసాగేందుకు వీలుగా ఆ వేళే తిరుగువిమానంలో సీటు బుక్‌చేయించిపెట్టేరు అధికారులు. బ్రహ్మభేద్యంగా తోచిన యీ కార్యభారం బూరుగుదూదిలాగ తేలికఅయిపోయిందన్న సంతోషంతో సుష్టుగా భోంచేసి ఒంటిగంటకల్లా ఎయిరోడ్రోము చేరుకున్నాను. ఒక పత్రికావిలేఖరి, ఒక వ్యాపారస్థుడూ, నేనున్నూ ఆనాటి ప్రయాణీకులం. ఒకరికొకరు ఎరికపరుచుకుని కులాసాగా మాట్లాడుతూ కూర్చున్నాం అక్కడ వున్న లౌంజిల్లో. ఇంకొక అరగంటకి "టేక్ ఆఫ్" (Take off)అనగా షాఫరువచ్చి సామాన్లు ప్యూసిలాజ్‌లో సర్దేనని చెప్పేడు. మరో పదిహేనునిముషాల్లో పైలటుకూడా కాక్‌పిట్టులో ప్రత్యక్షమయేడు—హెడ్‌ఫోనులు వగైరా పరికరాలు సరిగా అమర్చుకుని, స్టార్టర్ స్విచ్ నొక్కుతూను. ట్విన్ ఇంజనేమో, ప్రొపెల్లర్లు ఓఁ అని ఒకటే మోత సాగిస్తున్నాయి. షాఫరు మొహాన్ని ఓ అయిదురూపాయిల నోటు గిరవాటేసి విమానాన్ని అధిష్ఠించేం. మేమూ ఎక్కగానే ఠకీమని తలుపు వేసి, సలాం చేసి పక్కకి తప్పుకున్నాడు షాఫర్. వోవర్‌హెడ్ మైకా కవరు ముందుకు లాక్కుని బ్రేకు సడిల్చేడు పైలటు. స్లోపులో వున్న విమానం ఒక నాలుగు అడుగులు వెనక్కి జారి, పదిగజాలు ముందరికి పాకిరి, వట్రువగా, అంటీఅంటకుండా అందాఅందంగా నేలనుంచి లేచిపోతోంది. చెట్టుకొమ్మలతో సమానంగా వున్నది కాస్తా, పెళ్లియీడు పిల్ల తల్లి కంటిముందే ఎదిగిపోయినట్టు, చూస్తూవుండగా చివరికొమ్మలకంటే పైకి పోయిపోయి, కొండశిఖరాలని చూడాలంటేకూడా క్రిందికి వొంగిచూడవలసినంత ఎత్తుకి పోయింది. అయిదు నిమిషాల్లో అంతరిక్షాన్న సంచరిస్తున్నాం. క్రింది భూపరిస్థితి అంతా అరచేతిలో యిమిడే పటమంత చిన్నదిగా కనిపిస్తోంది. సూర్యకాంతిలో మిలమిల

లాడుతూన్న యమునానది భూదేవిపాదాన్ని తొడిగిన వెండిగొలుసులాగ కనిపించింది. మేఘాలని దూసుకుపోతోంది విమానం. చిన్నప్పుడు శరద్రాత్రుల్లో ఆరుబయట పడుకుని దూదిపింజల్లాంటి మేఘాలు చంద్రుణ్ణి తాకి వెళ్లిపోతూంటే చూచి ఆనందించిన ఆ అమాయిక సంతోషం తిరిగీ అనుభవించగలిగేను. ఇంకా వుండబట్టలేక ఒక్కసారి కిటికీతలుపు కొంచెం దించి బుర్ర పైకి పెట్టేసరికి, రివ్వున టోపీ ఎగిరిపోయి క్రాపింగు మొహంనిండా చెదిరిపోయింది. చెప్పలేని ఆనందం అనుభవైకవేద్యంగా వుంది. అయిదువేల అడుగుల ఎత్తున సంచారం ఆయిరి. నిర్విచారమయిన ప్రయాణం, సర్వసౌకర్యాలతో కూడుకొన్నదీని. డైనింగుసెలూనులో అల్పాహారాలు పుచ్చుకోడానికి లేచేం, నాటి జటాయువుకో, గరుత్మంతుడికో మనం జ్ఞాతులం అయివుండాలి అని సంబంధాలు కలుపుకుంటూను!

౬

గాలికి బారుగా వొదిలిన గాలిపడగలాగ సాఫుగా పోతూన్న దాంట్లో అతాత్తుగా టకటకమని—బండిచక్రం కమ్ముల్లో కర్రపెట్టిన ధ్వనిలాగ—వినిపించింది. మేం ముగ్గురమూ గతుక్కుమన్నాం. కాక్‌పిట్టులో పైలటు బుర్ర ఒక్కమారు తీవ్రంగా కంపించింది. గబగబా టప్‌టప్ మని రెండుమూడు స్విచ్చిలు నొక్కేడు ఆవేగంతో; జాయ్‌స్టిక్కు గట్టిగా పట్టుకుని అటూ యిటూ వూపి ఏదో ఒక పొజిషన్‌లో గట్టిగా పట్టుకూర్చున్నాడు. అప్పటికప్పుడే బేలెన్సు తప్పి తోకతెగిన గాలిపటంలాగ అల్లల్లాడిపోతోంది విమానం. కళ్లు తిరిగినట్టనిపించింది. ఏమిటి చెప్మా అని పరకాయించి చూసేం. యింకేఁ వుంది? ప్లేను దిగడిపోతోంది; వట్రసుడిగా తిరిగిందేమో కూడాను; యింతలోకే శిరసాసనం వేసినదానిలాగ తల్లక్రిందుగా పడిపోతోంది. భూమిని సమీపిస్తున్నకొద్దీ కళ్లముందు చెట్లూ చేమలూ గిర్రున తిరుగుతున్నాయి. ఇంజన్ ఫెయిల్!

ఆ మాట తట్టేసరికి గుండెలు విచ్చిపోయినాయి. అలాగ గిరగిరా తిరిగి యింక ఓ పావుగంటలో ఏ చెట్టునో పుట్టనో ఢీకొట్టి బ్రద్దలైపోతుంది విమానం. ఈలోగానే పెట్రోలు టేంకుగానీ అంటుకుందా బండెడు కర్రల ఖర్చుకూడా అక్కరలేకుండా పోతుంది యీ జీవద్భారం. ఎంత పని! ఎంత పనీ? కాకపోయినా నలభైఏళ్లు వొంటికొచ్చికూడా చిన్నపిల్లాడిలాగ అంత వుబలాటమేఁవిటి వొళ్లు తెలియకుండాను? ఆ అధికార్లనే మంచిచేసుకుని కాయితాలు వెళ్లిరావడానికి మరోరెండురోజులు వ్యవధి కల్పించుకోకూడదూ? హాయిగా తుఫానుమెయిల్లో గట్టి యినుపదారి మీద నెమ్మదిగా యిల్లు చేరుకునివుండునే! యింతకూ యోగం యిలా వుందికాబోలు!

ఆరేళ్లకి కంటబడ్డ చెల్లాయి! పట్టుమని పదినిమిషాలు అయినా తృప్తిగా మాట్లాడలేదు. బావతో ఒక్కసారిఅయినా సరసని కూర్చుని భోంచెయ్యలేదు. పోనీ అని సిల్కుఎంపోరియంలో కొన్న గుడ్డముక్కలయినా యిచ్చేస్తే కొంత బావుణ్ణు! ఆ క్రేప్ సిల్కుఫ్రాకు తొడుక్కుంటే ఎంత ముచ్చటగా వుంటుందీ ఆ చిన్నముండ!! శ్రీరామ, రామ!!!

సరి. ఒక్కనాటిలో మిగిలిన అరవైయేళ్లు దాపురించి నూరేళ్లు నిండినట్టు ఎకౌంటుచూపించీసేయి. ఇన్‌షూర్యెన్సు, ప్రావిడెంటుఫండు కలుపుకుని గుప్పెడు నోట్లు యింట్లో చేరెయ్యగానే అయిపోయిందీ? ముప్ఫైఏళ్ల మనిషి ;ఆవిడ ;. కనీ పెంచవలసిందిన్నీ. మొగాడు కాదుకదా మరో పెళ్లి చేసుకోడానికీ? ఛీ! అదే అసందర్భపుపని యెవరైనాను. అలాంటి పనే చేస్తే యింతవరకూ చేసిన కాపురం కేవలం నటన అన్నమాట. పశుకాంక్షతో కూడుకున్న పనులలో ఆత్మరుచిరత్వానికి తావులేదు కాబట్టి. పిల్లాజెల్లా వున్నవాళ్ల విషయంలో అయితే ద్వితీయం అంత అసందర్భప్పని యింకోటి వుండదు: ఆ రెండో పెళ్లి కాముకత్వాభిలాషతో చేసుకున్నదేగా?...

“తప్‌తపీ, తప్‌తపీ” మన్న చప్పుడుతో చింతనాలోకంలోంచి చైతన్యం కలిగింది నాకు. విమానం ముందుకు త్రుళ్లిపడినట్టు అయింది; బర్రుమని పెద్ద భోషాణం యీడ్చిన చప్పుడుతో పక్కకి వొరిగిపోయింది. క్రేష్! రెప్పపాటుకాలం నిలువునా ప్రా

ణాలు యెగిరిపోయినాయి అంటే నమ్మండి. రెండు చేతులతోనూ ముఖం గట్టిగా కప్పేసుకున్నాను. వోరగని వేపు కిటికీ పట్టుకుని పదిపది పేనుగురు లాగి పొజిషన్‌లో పెడుతూవుంటే కళ్లు విప్పడానికి ధైర్యం కలిగింది. పైలటుకిటికీలోనుంచి బుర్ర పెట్టి "ఆల్ రైట్?" అని ప్రశ్నించేడు. మరోయిద్దరు సాయంపట్టి నిరుత్తరంగా స్తబ్ధులయి చూస్తూన్న నన్ను దింపేరు, రెక్కలుపట్టుకుని.

అంతా అయోమయంగా వుంది. కాని వాళ్లు ఆడుతూన్న మాటల గొడవకీ, పుచ్చుకోమని యిచ్చిన 'టీ' వేడిమికీ గాబోలు తలదిమ్ము వొదిలి, కళ్లముందు జరుగుతున్నదంతా భ్రమ కాదు వాస్తవమేనన్న జ్ఞానం అంకురించింది. బ్రతికివున్నమాట నిజమని తోచేక, యిహ చూడండి నాధైర్యపరాక్రమాలు. పైలటుకూడా అన్నాడు సిగరెట్టు అందిస్తూను: "మీకు చాలా మనోధైర్యం వుందండీ"అని.

"ఏం ?"

"పెట్రోలు సరిగా అందక యింజను ఫెయిలవడంతోనే, గాలిదుమారం మూలాన్న నోజ్ డైవ్ (Nose Dive)చేసింది విమానం. ఆపరిస్థితులలో బాగా తర్ఫీదు పొందిన మాలాంటివాళ్లకే తలతిరిగి, దిమ్మపట్టి, జడత్వం ఆపాదించుకుపోతుంది. చూడండీ, మీ తోడి ప్రయాణీకులు ఎల్లా పడిపోయేరో"నని స్ట్రెచ్చెర్లమీద స్పృహలేకుండా దిగుతూన్న కళేబరద్వయాన్ని చూపించేడు.

"మనం ఎక్కడ వున్నాం? ముందుమాటేవిటి ?"

"ఇది ఆగ్రాఎయిరోడ్రోము. డకోటాప్లేను యింకోగంటలో బయలుదేరుతుంది; అందులో వెళుదురుగాని లెండి. కలకత్తాయేగా ?"

ఎంత సులువుగా అనీసేడూ, ఇక్కడికి పడ్డ బాధలు చాలనట్టూ? కలకత్తా కాకపోతే కామచాట్కవెడతా ననుకున్నాడుకాబోలు! ఆరి పిడుగా, వాడి ధైర్యానికి మెచ్చుకోవాలి!

"నా లైఫ్ యిన్‌ష్యూరుచేసుకోలేదండోయ్" అన్నాను నవ్వుతాలకి.

"ప్రాణాలే కడపాయిచ్చినవాణ్ణి నామాటేంవిటంటారు"అన్నా డాయన నిర్భయంగా అట్టహాసం చేస్తూనూ.

డమ్‌డమ్‌ఎయిరోడ్రోములో వ్రాలడమే తడవుగా మేనేజరు అమాంతంగా వొచ్చి పొదివిపట్టుకున్నాడు. "నిరపాయంగా వొచ్చేరుకదూ?" అంటూను' రెండుగంటలక్రితంనుంచీ కాచుకూచున్నాట్ట మాకోసం. మధ్యేమార్గంలో సంభవించిన యీసంఘటన చెవిన పడ్డ దగ్గరనుంచీ మరీ నిమిషం ఒకయుగం అయిపోయిందిట అతనికి, పాపం !

ఇవన్నీ చెబుతూవుంటే మాబావ రాస్తూకూర్చున్నాడు ఏదో. చివరికి అడిగేసేను : "ఏంవిటోయ్, చెడ రాసేస్తున్నావూ?"

"నీసంగతే. కథ వ్రాస్తున్నాను, కమ్మగా ఉంటేను. ఈ కాయితాలు ఫెయిర్‌చేయించి పత్రికకి పంపు" అన్నాడు.

